# గుబ్బాలనీ, గాడిదలనీ......

గడియారం ఏడు సార్లు మ్రోగింది.... బద్ధంకగా లేచి ఒళ్ళు విరుచుకున్నాను. ప్రొద్దుటనుంచీ అదే పనిగా టైపు చేయటము వల్ల కాళ్ళు చేతులు లాగుతున్నాయి.

ఎదురుగా బాస్ కేబిన్ బయట ఎఱ్ఱ బల్బు వెలుగుతోంది. అంటే బాస్ ఏదో ముఖ్యమైన విషయాలు చర్చిస్తున్నారన్నమాట. అతను చర్చ ముగించేదెప్పుడో, ఇంటికి బయలుదేరేదెప్పుడో!

గట్టిగా నిట్టూర్చి సీటులో నుంచి లేచాను.

ఖాళీ అయిపోయిన ఆఫీసు, 'షో' అయిపోయిన సర్కస్‌టపారంలా ఉంది. అవసరాన్ని బట్టి ప్రేక్షకుడే ప్రదర్శకుడిగాను, ప్రదర్శకుడే ప్రేక్షకుడిగాను, మారే మా ఆఫీసు అనే సర్కస్ ప్రపంచం ప్రశాంతంగా వుంది.

ఖాళీగా ఉన్న కుర్చీలను దాటుకుంటూ ముందుకు నడిచాను. చివరగా ఉంటుంది సుందరం కేబిన్.

సుందరం వుంటే కాస్సేపు కబుర్లు చెప్పుకోవచ్చని అనుకున్నాను. ఆఫీసులో పర్సనల్ మేనేజర్ అయినా, వాడు నా చిన్ననాటి స్నేహితుడు, అరిమరికలు లేకుండా కబుర్లాడుకోవచ్చు.

"మూడు గంటలకే వెళ్ళిపోయారండీ" సుందరం కేబిన్ తలుపు తీస్తుంటే అన్నాడు బంట్రోతు. "ఏదో సొంతపని వుందట"

నేను ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే సుందరం ఎప్పుడు ఆఫీసుకు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో అనేది ఎవ్వరికీ తెలీదు. రెండు మూడు గంటల కన్నా ఏ రోజూ ఆఫీసులో కనబడడు. అది అతనికి ఈనాటి అలవాటు కాదు. స్కూలు రోజులు నుంచీ అంతే. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు క్లాసుకి వచ్చేవాడు. పుట్టుకతో వచ్చే బుద్ధులు పుడకల దాకా అని అంటారు కదా మరి! ఉద్యోగంలో చేరిన కొత్తలో సుందరం

ప్రవర్తన చాలా వింతగా తోచేది నాకు. ఉద్యోగస్తులలో క్రమశిక్షణ అమలుజరపవలసిన సుందరమే క్రమశిక్షణారహితముగా ప్రవర్తించటము చూసి వాడిని ఒకటి రెండుసార్లు అడిగేను కూడా. కానీ యాజమాన్యం వారు ఆ విషయముపై ఒక్కసారి కూడా పెదవి మెదపలేదట. యాజమాన్యంపై అతనికి వుండే పలుకుబడి అటువంటిది.

మరో రెండు అడుగులు ముందుకు వేసి తలుపు దగ్గరకు వచ్చాను.

నిండు గర్భిణిలా కనబడింది ఉత్పత్తి ప్రారంభించబోయే కర్మాగారం సోడియం వేఫర్ ల్యాంపుల కాంతిలో హడావిడిగా యూనిఫాములలో తిరిగే యింజనీర్లు, ఆపరేటర్లు నిండుచూలాలుకు శస్త్రచికిత్స చేసే డాక్టర్లలాగానూ, నర్సులలాగానూ కనబడ్డారు.

ప్రమాదము పొంచి వున్న విస్ఫోటక వస్తువులనుంచి ప్రజలకు ప్రయోజనకరమైన రసాయన వస్తువులని తయారుచేయటానికి వాళ్ళు పడుతున్న బాధని చూస్తూ నిలబడిపోయాను.

"ఏమోయ్ యింకా యింటికి వెళ్ళలేదు?" ఆ గొంతుకి ఉలిక్కిపడ్డాను. పక్కనే నిలబడి వున్నాడు మా ప్రొడక్షన్ మేనేజర్ శర్మ. వెనుక యిద్దరు యింజనీర్లు.

"బాస్ యింకా వున్నారు" నేను అతనివేపు తిరుగుతూ అన్నాను. చాలా నీరసంగా కనబడ్డారు వాళ్ళు. లోతుకు పోయిన కళ్ళచుట్టూ నల్లని చారలు కనబడ్డాయి. శర్మ మాట ఎంతో లోతునుంచి వస్తున్నట్టు తోచింది. గత మూడు రోజులుగా అతను ఫ్యాక్టరీలోనే వున్నాడట.!

"ప్రోడక్షన్ ఎప్పుడు వస్తుందండీ" నేను ఆతృతగా అడిగేను.

"ప్రోబ్లమ్స్ ఏమీ రాకపోతే తెల్లారేలోగా రావచ్చు" షేవింగ్ చేసుకొని గెడ్డము నిమురుతూ ఆలోచనగా అన్నాడు శర్మ.

హఠాత్తుగా ఫ్యాక్టరీ నుంచి ఏదో శబ్దం వినబడింది. ఎర్రబల్బులు వెలిగాయి. ఫ్యాక్టరీ వైపు పరుగెత్తారు వాళ్ళు.

వాళ్ళని చూస్తూ వుంటే నాకు జాలివేసింది. గత మూడు రోజులుగా తగినంత నిద్రాహారాలు లేకుండా పనిచేస్తున్నారు వాళ్ళు. గత మూడు రోజులనుంచేయేకాదు, ఫ్యాక్టరీ కట్టడం మొదలుపెట్టిన దగ్గరనుంచీ ఆదివారాలతో సహా అన్ని రోజులు పనిచేస్తున్నారట వాళ్ళు. అలా పని చెయ్యటం వల్లవే అనుకున్నదానికన్నా ఆరే నెలలముందే ఉత్పత్తి సాధించబోతోందట కర్మాగారం! అందుకు గుర్తింపుగా యాజమాన్యపు వారు ఉద్యోగస్తులకు నగదు బహుమతులు యివ్వబోతున్నారు. ఆ కాగితములు సంతకము కొరకు మా బాస్ బల్లపై ఎదురుచూస్తున్నాయి.

బజర్ మ్రోగింది. బాస్ పిలుస్తున్నారన్నమాట!

ఒక్క వురుకులో బాస్ కేబిన్‌లోకి వెళ్ళిన నేను రెండు అడుగులు వెనక్కు వేసాను.

కోపంగా వున్నారు బాస్. ముఖ్యమైన విషయములు చర్చించేటప్పుడు కేబిన్ బయట వెలిగే ఎర్ర బల్బులు బాస్ కళ్ళల్లో కనబడ్డాయి. "నేను చెప్పింది ఏమిటి, నువ్వు టైప్ చేసింది ఏమిటి?" ఓ కాగితము నావేపు విసిరికొడుతూ అడిగేరు అతను. ఉత్పత్తి రాగానే ఉద్యోగులకు యాజమాన్యమువారు అనుకున్న నగదు బహుమతుల వివరాలు యిచ్చే కాగితము అది.

నేను కాగితం అందుకున్నాను. అంతా సమంగానే కనబడింది నాకు" అంతా కరెక్టుగానే...." నేను గొణిగేను.

"ఏమిటి కరక్టు" ప్రొడక్షన్ వాళ్లకు 20 శాతం ఇమ్మని చెప్పానా?"

"20 శాతమని టైపు చెయ్యమనే చెప్పారు కదండీ?"

"చెప్పాను నిజమే. కానీ అది ఎవరికయ్యా? ప్రొడక్షన్ వాళ్లకు కాదు. ఆఫీస్ స్టాఫ్‌కి ఛీ...ఛీ... బొత్తిగా తప్పులు కొట్టేస్తున్నావు. వెళ్ళి మళ్ళీ టైపు చేసి పట్రా" నా కళ్ళు తిరిగిపోయాయి "ఇది అన్యాయం సార్" నేను వుండబట్టుకోలేక అన్నాను. "రాత్రింబగళ్లు ప్రమాదాలతో కూడిన పనులు చేసేది వీళ్ళు సురక్షితంగా ఆఫీసులో కూర్చున్నవాళ్ళు..."

"గాడిదలనీ గుఱ్ఱాలనీ ఒక్కచోట కట్టకూడదయ్యా తొందరగా టైపు చేసి పట్రా".

కాగితం తీసుకొని బయటకు వస్తూ అనుకున్నాను.

అవును మరి! పదో తరగతి నుంచీ పుస్తకాల బరువులుమోయటం అలవాటు చేసుకున్న యింజనీర్లు గాడిద చాకిరీ చెయ్యకపోతే మరేం చేయగలరు!

రాఘవీస్ కోకిల డిశంబర్, 1996